క్లుప్తంగా

ఆంజనేయుడికి బోనాలు



బోనాలతో ఊరేగింపుతున్న వెళుతున్న దృశ్యం

మద్దికెర: కసాపురం ఆంజనేయస్వామికి బోనాలు సమర్పించేందుకు స్థానిక హరిజన కాలనీ నుంచి భక్తులు గురువారం ఊరేగింపుగా తరలి వెళ్లారు.ముందుగా స్థానిక స్వామివారి ఆలయంలో పూజలు నిర్వహించి మేళతాళాలతో బోనాలను మోసుకొని కాలినడకన 5 కి.మీ దూరంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి వారి కి సమర్పించడం పూర్వం నుంచి ఆచారంగా వ స్తుందని.ఆలయానికి వెళ్లి పూజలు చేసి మొ క్కులు తీర్చుకుంటామని కాలనీవాసులు తెలిపారు.

అమ్మవారికి బోనాలు

వెల్దుర్తి: ఉగాది పురస్కరించుకుని స్థానిక వడ్డెగేరి సుంకులమ్మ ఆలయంలో ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గురువారం పట్టణ మహిళలు కిందిగేరి మారెమ్మకు, అనంతరం వడ్డేగేరి సుంకులమ్మకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వడ్డె గేరి సుంకులమ్మ ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అమ్మవారిని 5 బావుల నుంచి బిందెలలో తెచ్చిన నీటితో అభిషేకించారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు



ఆస్పరి పోలీస్‌స్టేషన్‌కు చేరిన పదో తరగతి ప్రశ్న పత్రాల బండిళ్లతో అధికారులు

ఆస్పరి: పదోతరగతి ప్రశ్నపత్రాలు గురువారం మండలానికి చేరాయి. అధికారులు వాటిని పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. 10వ తరగతికి సంబంధించి సెట్-1, సెట్-2, సెట్-3 ప్రశ్నపత్రాలను ఎస్‌ఐ వరప్రసాద్, ఎగ్జామ్ అధికారులు సుజాత, వెంకటరమరణ, రమేష్, హనుమంతు సమక్షంలో భద్రపరిచారు.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఐ మురళీమోహన్

పత్తికొండ రూరల్: గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ మురళీమోహన్ హెచ్చరించారు. గురువారం రాత్రి కనకదిన్నె గ్రామంలో పోలీసు సిబ్బందితో కలిసి పర్యటించారు. అనంతరం గ్రామస్తులనుద్దేశించి సీఐ మాట్లాడుతూ గొడవలకు తావులేకుండా ఒకరికొకరు స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు.

బాధిత కుటుంబాలకు సాయం



దుర్గమ్మకు ఆర్థికసాయం అందజేస్తున్న రామకృష్ణ

గోనెగండ్ల: గాజులదిన్నె గ్రామానికి చెందిన కురువ వెంకటేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అలాగే బోయ పరమేష్ భవనంపై నుంచి కింద పడి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీసీ విద్యార్థి సంఘం జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం గాజులదిన్నె గ్రామానికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. మాజీ ఎంపీపీ హనుమంతు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వినూత్నంగా సేవ్ జర్నలిజం డే



ఎమ్మిగనూరులో కళ్లకు గంతలు కట్టుకొని మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో గురువారం ఐజేయూ పిలుపుమేరకు సేవ్ జర్నలిజం డే కార్యక్రమాన్ని ఆ సంఘ నాయకులు వినూత్నంగా నిర్వహించారు. సంఘ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకొని ర్యాలీగా మౌన ప్రదర్శన చేశారు. అనంతరం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతి పత్రం సమర్పించి గాంధీ విగ్రహం ముంది మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే తాలుకా, పట్టణ అధ్యక్షులు శ్రీనివాసనాయుడు, పరమేశ్వర మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని కోరారు. జిల్లా, తాలుకా, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

బాలికల విద్యకు కేజీబీవీ అండ

- 27 నుంచి ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్ దరఖాస్తుల స్వీకరణ
- 6వ తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలు
- 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లు భర్తీ



23 ఏఎల్‌ఆర్ 01ఎ: ఆలూరు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల

ఆలూరు: బడుగు, బలహీన వర్గాల బాలికలను విద్యకు మరింత చేరువ చేయాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలను ఏర్పాటు చేసింది. ఆయా పాఠశాలలో ప్రవేశాలు కల్పించేందుకు అర్హులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్ విడుదల చేసింది. కర్నూలు జిల్లాలో 26, నంద్యాల జిల్లాలో 27 చొప్పున కేజీబీవీ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో చేరేందుకు 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ విద్యార్థినులు ఆన్‌లైన్ పద్ధతిలో హెచ్‌టీటీపీఎస్:// ఏపీకేజీబీవీ ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు ఎస్.సురేష్ కుమార్ ప్రకటనను విడుదల చేశారు. ఈనెల 27వ తేదీ నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు వారు ప్రకటించారు. ఆన్‌లైన్ పద్ధతిలో మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తారు.

వీరికి ప్రాధాన్యత

అనాథ, వీధి బాలికలు, బడి బయటి వారు, డ్రాప ఫుట్ (బడి మానేసిన వారు), పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలకు మాత్రమే కస్తూర్బా పాఠశాలల్లో చేరేందుకు అవకాశం ఉంటుంది. వలస కూలీల చిన్నారులు, అసిస్టెంట్ లేబర్ సహాయ శాఖ అధికారులు సూచించిన వారికి ప్రవేశాల్లో ప్రాధాన్యత ఇస్తారు.

కస్తూర్బా పాఠశాలల్లో సీట్ల వివరాలు

6వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో పూర్తిస్థాయి ప్రవేశాలతో పాటూ 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులను స్వీకరిస్తారు. పాఠశాలలో అడ్మిషన్లకు ఎంపికైన విద్యార్థునులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందిస్తారు. ప్రతి పాఠశాలలో 6వ తరగతిలో చేరేందుకు 40 సీట్లు ఉంటాయి. అలాగే ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు అన్ని రకాల కోర్సులలో 40 సీట్లు చొప్పున ఉంటాయి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థినులు ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాలి. బడికి దూరమైన బాలికలు, అనాథ, వీధి బాలికలకు ప్రాధాన్యత ఉంటుంది. ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బాలికలకు సీట్లు కేటాయిస్తాం. విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలి.

– సునీత, ఆలూరు ఎస్‌ఓ

ఆ స్థలాలు పంచాయతీవి కాదు

ఆలూరు రూరల్: పట్టణంలోని హైవే-167 పక్కన బంకులు వేసి ఆక్రమించిన స్థలాలు గామ పంచాయతీకి చెందినవి కాదని ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ కృష్ణకుమార్ వెల్లడించారు. ఆయన గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతూ ఆదోని-బళ్లారి హైవేలో ఏర్పాటు చేసిన బంకుల స్థలాలు జాతీయ రహదారుల శాఖ ఆధీనంలోకి వస్తాయన్నారు. డ్రైనేజీ నుంచి ఒకటిన్నర మీటరు స్థలం తాగునీటి పైపులైన్ ఏర్పాటు కోసం కేటాయించినట్లు హైవే అథారిటీ ఇంజినీర్లు తెలిపారన్నారు. భవిష్యత్తులో పైపులైన్ ఏర్పాటు చేస్తే బంకులు తొలగించాల్సి వస్తుందని హైవే అధికారులు తెలిపారన్నారు. హైవేలో కాకుండా గ్రామ పంచాయతీ పరిధి స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

25న మండల సమావేశం

చిప్పగిరి: ఈ నెల 25న ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్ రాజు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని కోరారు. అధికారులు వారి శాఖల ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

మహిళా కబడ్డీ విజేత హర్యానా



తలపడుతున్న హర్యానా-అనంతపురం జట్లు

తుగ్గలి: క్రీడలు మానసిక పరిపక్వతను పెంచుతాయని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఊటకంటి అమరనాథరెడ్డి అన్నారు. ఉగాది పండుగ, చౌడేశ్వరీదేవి ఉత్సవాల సందర్భంగా రెండు రోజులుగా కడమకుంట్లలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీలు గురువారం ముగిశాయి. ఫైనల్ పోటీలో హర్యానా జట్టు విజేతగా నిలవగా తమిళనాడు జట్టు రన్నర్స్‌గా నిలిచింది. తర్వాతి స్థానాల్లో వైజాగ్, కేరళ, బెంగళూరు, గుజరాత్ జట్లు నిలిచాయి. విజేతలకు టోర్నమెంట్ నిర్వాహకులు అమరనాథ రెడ్డి రూ.75 వేలు, రన్నర్స్‌కు రాతన వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమామహేశ్వర రెడ్డి రూ.50 వేలు, తర్వాతి స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా గ్రామ వలంటీర్లు రూ.30 వేలు, బాసాని లక్ష్మీనారాయణరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి రూ.20వేలు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రూ.10వేలు, ఊటకంటి సంజీవరెడ్డి రూ.5 వేలు అందజేశారు. అమరనాథ రెడ్డి మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారిణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి పోటీలను తిలకించారు. బెస్ట్ రైడర్, డిఫెండర్లకు పలువురు ప్రోత్సాహక నగదు అందించారు. వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు ఆదిలక్ష్మి, రమేష్, రామాంజినేయులు, బాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన పంచాయతీ ఆదాయం



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ తిమ్మక్క

వెల్దుర్తి: స్థానిక మేజర్ పంచాయతీకి సంబంధించి వివిధ వ్యాపార హక్కుల వేలాలలో గతేడాది కంటే రూ.6 లక్షలు ఆదాయం తగ్గింది. గురువారం డీఎల్‌పీఓ తిమ్మక్క, ఈఓఆర్డీ/ఈఓ నరసింహులు, సర్పంచ్ ముత్యాల శైలజ, జెడ్పీటీసీ సుంకన్న, ఎంపీటీసీ బొమ్మన రవిరెడ్డి సమక్షంలో స్థానిక కార్యాలయంలో వేలం నిర్వహించారు. కొత్త నిబంధనల మేరకు ప్రముఖ ఆదాయ వనరులైన పార్కింగ్ ఫీజు, వారపు సంతలను వేలందారులు తక్కువ మొత్తానికి దక్కించుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల మేరకు.. బస్టాండు పార్కింగ్ ఫీజు వసూలు హక్కులను పట్టణానికి చెందిన మున్నా రూ.6 లక్షలకు, వారపు సంతను మురళి రూ.3 లక్షలకు (గతేడాది కంటే రూ.1,60,000 తక్కువ) దక్కించుకున్నాడు. జంతు వధశాలను షాఫిర్ రూ.1,20,000కు, దినసరి మార్కెట్‌ను అన్వర్ రూ.3,41,000కు, ఆర్‌కే రోడ్డులోని 8 వ్యాపార అంగళ్లను (ఒక్కో రూముకు) ఏడాదికి రూ.1,26,000లకు, రెండు పెద్ద మాంసం అంగళ్లు రూ.22,800కు దక్కించుకున్నారు. మొత్తంగా పంచాయతీ వేలాలలో రూ.23,91,800 ఆదాయం లభించింది. గతేడాది కంటే రూ.5,96,000 ఆదాయం తగ్గినట్లు డీఎల్‌పీఓ వెల్లడించారు. వేలంలో హక్కులు పొందిన వారు నిబంధనల మేరకు నడుచుకోవాలని సూచించారు.

26 నుంచి దేవర

ఎమ్మిగనూరురూరల్: గార్లదిన్నె గ్రామంలో ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు భీమలింగేశ్వర స్వామి, లక్ష్మీదేవి దేవర మహోత్సవాలు జరగనున్నట్లు గ్రామ పెద్దలు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దేవుని కృపకు పాత్రులు కాగలరని కోరారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పాఠశాలకు కుర్చీలు విరాళం

మద్దికెర: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు 1983-84 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు రూ.10 వేలు విలువ చేసే కుర్చీలను గురువారం ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరికి అందజేశారు. పూర్వ విద్యార్థులు మల్లికార్జున, రామకృష్ణ మాట్లాడుతూ.. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధి తమ వంతు సాయం అందిస్తున్నట్లు తెలిపారు ఏర్పాటు చేసినట్లు వారు వెల్లడించారు.

26 నుంచి క్రికెట్ టోర్నీ

వెల్దుర్తి: సిద్ధినగట్టు గ్రామంలో సుంకులమ్మ తల్లి దేవర పురస్కరించుకుని టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఈనెల 26వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. విన్నర్స్‌కు రూ.20 వేలు, రన్నర్స్‌కు రూ.15 వేలు, తర్వాతి స్థానాలకు రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున అందించనున్నట్లు నిర్వాహకులు ప్రేమ్, రామదాసు, భాస్కర్, పవన్, మహేంద్ర తెలిపారు. గ్రామపెద్దల సహకారంతో నిర్వహించే ఈ టోర్నీలో పాల్గొనదలచినవారు రూ.600 ఎంట్రీ ఫీజుతో 80969 69528, 89195 46796 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

31న కబడ్డీ పోటీలు

కృష్ణగిరి: శ్రీరామనవమి పండుగ పురస్కరించుకుని పెనుమాడ గ్రామంలో ఈ నెల 31న రాష్ట్రస్థాయి బాలుర కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. గెలుపొందిన వారికి దాతల సహకారంతో వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల జట్లు రూ.300 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. క్రీడాకారులకు భోజన సౌకర్యం కల్పించామని, వివరాలకు 97012 59228, 90000 30774 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఐదు నామినేషన్లు దాఖలు

పత్తికొండటౌన్: పత్తికొండ న్యాయవాదుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక కోసం నామినేషన్ల దాఖలు ప్రక్రియ గురువారం ప్రారంభం అయ్యింది. 5 స్థానాలకు సంబంధించి తొలిరోజు ఒక్కోపోస్టుకు ఒక్కొక్కరు చొప్పున మొత్తం 5 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి ఎ.వైరాముడు, ఆడిట్ అధికారి పి.ఎల్లారెడ్డి తెలిపారు. అధ్యక్ష స్థానానికి ఎన్.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి స్థానానికి బి.రంగస్వామి, ఉపాధ్యక్ష స్థానానికి కె.దామోదరాచారి, కోశాధికారి స్థానానికి హెచ్.మహేశ్, లైబ్రేరియన్ పోస్టుకు ఎం.రవికుమార్ నామినేషన్లు వేశారు. 24వ తేదీ సాయంత్రం 4గంటల వరకు నామినేషన్ల దాఖలుకు గడువు అని, 25న పరిశీలన, 26న ఉపసంహరణకు అవకాశం, 30న ఉదయం పోలింగ్, సాయంత్రం కౌంటింగ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సహాయ ఎన్నికల అధికారులు మధుబాబు, ప్రసాద్‌బాబు, న్యాయవాదులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఉద్యోగి మృతి



గాదిలింగప్ప (ఫైల్)

ఆలూరు రూరల్: హాలహర్వి మండలంలో హౌసింగ్ శాఖలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గాదిలింగప్ప (54) గురువారం గూళ్యం గ్రామంలో గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు.. హొళగుంద మండలం చిన్నహ్యాటకు చెందిన గాదిలింగప్ప 20 ఏళ్లకు పైగా హాలహర్వి మండలం హౌసింగ్ శాఖలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం ఆదోనిలో నివాసం ఉంటున్నాడు. గూళ్యం గ్రామంలో వివాహం చేసుకున్నాడు. విధుల్లో భాగంగా గురువారం గూళ్యం గ్రామానికి వెళ్లాడు. ఛాతీలో నొప్పి రావడంతో అత్తమామల ఇంటికి వెళ్లి అక్కడే కుప్పకూలి ప్రాణాలు వదిలాడు. గాదిలింగప్పకు భార్య సుమంగళమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

హొళగుంద: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుని మంచి మార్గంలో నడవాలని జంగమర హొసళ్లికి చెందిన అజాత శంభులింగ శివాచార్య స్వామి భక్తులకు సూచించారు. ఎల్లార్తి గ్రామంలో గురువారం రాత్రి శివశరణి మహాసాధ్వీ హేమరెడ్డి మల్లమ్మ పురాణ ప్రవచన కార్యక్రమం ప్రారంభమైంది. స్వామి చేతుల మీదుగా పురాణ కార్యక్రమం ప్రారంభమవగా విశ్వారాధ్యశాస్త్రీ ప్రవచనాలు వినిపించారు. ప్రవచన కార్యక్రమం ఈ నెల 26 వ తేదీ వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

మిన్నంటిన సంబరాలు

ఆలూరు రూరల్: ఆలూరు గ్రామీణ పరిసర ప్రాంతాల్లో ఉగాది సంబరాలు గురువారం మిన్నంటాయి. తెలుగు నూతన సంవత్సరంలో భాగంగా రెండో రోజు చిన్నా, పెద్దా తేడా లేకుండా రంగులు చల్లుకుని సంబరాలు చేసుకున్నారు. మహిళలు, వృద్ధులు సైతం ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని కేరింతలు కొట్టారు.

నిబంధనలు పాటించాలి

గోనెగండ్ల: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్‌ఐ పి.తిమ్మారెడ్డి సూచించారు. గురువారం ఉదయం గాజులదిన్నె ప్రాజెక్టు స్టేజ్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువీకరణ పత్రాలు లేని 29 మందికి రూ.2500 జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పెండింగ్ చలనాలు చెల్లించాలని కోరారు.

నేడు వేలం పాట

ఎమ్మిగనూరుటౌన్: పురపాలక సంఘ పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను వారపు సంత మార్కెట్‌లో రుసుము వసూలు చేసుకునే హక్కులకు శుక్రవారం వేల పాట నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. ఔత్సాహికులైన వేలంపాట దారులు పాల్గొనాలని కోరారు.



పుప్పాలదొడ్డి నుంచి పల్లకీలో గిడ్డాంజనేయస్వామి

పిడకల సమరం

కైరుప్పల గ్రామంలో వీరభద్రస్వామి బ్రహోత్సవాల సందర్భంగా గురువారం జరిగిన పిడకల సమరం ఉత్కంఠ భరితంగా సాగింది. గ్రామంలోని రెండు వర్గాల వారు పిడకలను చేతపట్టి హోరాహోరీగా తలపడ్డారు. అరగంట పాటు జరిగిన పోరు అనంతరం పెద్దలు వీరభద్రస్వామి, కాళికాదేవిల వివాహ నిశ్చయం చేసి సంప్రదాయాన్ని కొనసాగించారు.

– ఆస్పరి



పూజలందుకుంటున్న కాళికాదేవి



సిద్ధమైన పిడకలు



కారుమంచి నుంచి గుర్రంపై వస్తున్న పెద్దరెడ్డి వంశస్తుడు నందకిషోర్‌రెడ్డి

రాగిజావతో విద్యార్థులకు బలం



రాగిజావ ప్రాముఖ్యతపై సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యార్థినులు

ఎమ్మిగనూరుటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తోందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని ఎంఎస్ బాలికల ఉన్నత పాఠశాలతో పాటు ఎస్ఎంఎస్ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో కలిసి విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పోషకాహారం అందించాలన్న లక్ష్యంతో బలవర్ధకమైన రాగిజావ పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. రాగిజావతో ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. బాలికల ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీపై విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. హెచ్‌ఎంలు గౌసియాబేగం, మధుసుదన్‌రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



మిట్టసోమాపురంలో పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ లక్ష్మీదేవి

నందవరం: మండల పరిధిలోని మిట్టసోమాపురం గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ఎడ్ల బండులాగుడు పోటీలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తెలుగు లక్ష్మీదేవి పోటీలను ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో రైతు ఏసన్న ఎడ్లు మొదటి స్థానంలో నిలిచి రూ.12,016 నగదు గెలుపొందాయి. రెండో స్థానంలో చిట్టిబాబు వృషభాలు రూ.8,016, మూడో స్థానంలో జాన్ ఎడ్లు 5,016, నాల్గవ స్థానంలో రాజు ఎడ్లు నిలిచి రూ.3,016 గెలుపొందాయి. దాతలు సర్పంచ్ లక్ష్మీదేవి, పెద్ద నరసింహులు, పీఎంసీ చైర్మన్ రామాంజనేయులు చేతుల మీదుగా విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహులు, లింగన్న, తాయన్న, వెంకటేష్, చిన్న నరసింహులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

కనులపండువగా ప్రభోత్సవం



ఎరుకలచెరువులో ప్రభను లాగుతున్న భక్తులు

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎరుకలచెరువు గ్రామంలో వెలసిన తిమ్మగురుడు స్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం ప్రభోత్సవాన్ని అశేష భక్తజనుల మధ్య గ్రామస్తులు కనులపండువగా నిర్వహించారు. ఉదయమే అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రభపై ఉంచి భక్తులు గ్రామ వీధుల గుండా జయ జయధ్వానాలతో గ్రామ శివారులోని అంజనేయస్వామి వరకు వెళ్లి అక్కడ పూజలు నిర్వహించారు. సాయంత్రం నంది కొల సేవ నిర్వహించారు. అలాగే పారువేట కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

రమణీయం.. రథోత్సవం



కటారుకొండలో గుంటి రంగస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కృష్ణగిరి: మండల పరిధిలోని కటారుకొండ గ్రామ శివారులో వెలసిన గుంటి రంగస్వామి తిరునాలను గ్రామస్తులు రెండు రోజులుగా జరుపుకుంటున్నారు. గురువారం స్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి గ్రామ వీధుల గుండా ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు.

వైభవంగా పారువేట ఉత్సవం



పారువేటకు పల్లకీలో ఊరేగింపుగా వెళుతున్న శ్రీరంగనాథుడు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథుడు ఉగాది సంబరాలలో భాగంగా గురువారం పారువేట ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి బిందెసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారు శ్రీదేవి, భూదేవి సమేతుడై ఊరేగింపుగా గ్రామ పరిసరాలలో ఉన్న గోదా చెరువులో వెళ్లారు. చెరువులో కుందేలును వదిలి పట్టుకునే పారువేట నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొనసాగిన సంప్రదాయం



దూదేకొండలో దొరల వంశీకుడిని గుర్రంపై ఊరేగిస్తున్న గ్రామస్తులు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని దూదేకొండ గ్రామంలో అనాదిగా వస్తున్న రాజరిక సంప్రదాయం ప్రకారంగా గురువారం పారువేట ఉత్సవం నిర్వహించారు. ముందుగా గ్రామ దేవతలకు పూజలు చేశారు. యువత కేరింతలు కొడుతూ దూదేకొండ దొరల సంస్థానం పాలేగారు చిన్న వెంకటప్పనాయుడిని మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ గుర్రంపై ఊరేగించారు. అలాగే హోసూరులో ఎద్దుల పారువేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. చక్రాళ్ల గ్రామంలో సర్పంచ్ పూరి శ్రీరాములు ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు రూ.2 వేలు నగదు బహుమతులు అందజేశారు.

గ్రామ దేవర్ల సంబరాలు



నదికైరవాడిలో మారెమ్మవ్వకు భోనాలు తీసుకెళ్తున్న భక్తులు

నందవరం: శుభకృత్ నామ ఉగాది సంబరాలలో భాగంగా గురువారం గ్రామాల్లో దేవర్లు కడు వైభవంగా జరిగాయి. గ్రామ దేవతలకు కుంభాభిషేకాలు కానిచ్చి వేడుకలు నిర్వహించారు. నదికై రవాడి, కొత్తకైరవాడి, ఇబ్రహీంపురం, కొట్టాల గ్రామాల్లో దేవర ఉత్సవాలు చేపట్టారు. డప్పుల దరువులు, మేళతాలల మధ్య గ్రామ దేవతలకు సమర్పించే కుంభోత్సవం ఆకట్టుకుంది. నదికైరవాడిలో మారెమ్మవ్వకు, ఇబ్రహీపురంలో మారెమ్మవ్వకు భక్తులు కుంభాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచే అమ్మవార్లకు ఆయా గ్రామాల్లో కుంభోత్సవం నిర్వహించారు. అమ్మవార్లకు కుంభంలో ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. అనంతరం బలిదానాలు కానిచ్చారు. సర్పంచులు నాగేశ్వరరెడ్డి, ఈశ్వరమ్మ, ఎంపీటీసీ బీసమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.